సాక్షి
పెద్దపల్లి
బుధవారం : 2 : అక్టోబర్ : 2024



పూల పండుగ

ఉమ్మడి జిల్లాలో నేటినుంచి బతుకమ్మ సందడి

పుట్టింటికి వచ్చిన ఆడపడుచులా.. రెక్కలు విచ్చిన సీతాకోక చిలుకలా.. కరుణించి కాపాడే అమ్మవారిలా.. తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగ రానేవచ్చింది.. ఊరూవాడా ఆటపాటల సందడి తెచ్చింది.. బుధవారం నుంచి ప్రారంభమయ్యే వేడుకలు సద్దుల సంబురంతో ముగియనున్నాయి. నేటి(తొలిరోజు) వేడుకను ఎంగిలిపూలు అంటారు. అంటే.. ముందు రోజు మొగ్గలుగా ఉన్న పూలను తెచ్చి, మరుసటి రోజు బతుకమ్మ పేర్చేటప్పుడు వాటిని ఊది పేరుస్తారు. పిత్ర అమావాస్య రోజు ఉదయం లేచి, చనిపోయిన పెద్దలకు నైవేద్యాలు చేస్తారు. ఆ తర్వాత భోజనం చేసి, బతుకమ్మను పేర్చడం వల్ల కూడా ఎంగిలి పూల బతుకమ్మ అంటారు. ఇలా రకరకాల కథలు ప్రచారంలో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాకు పండుగ వాతావరణం వచ్చింది.

న్యూస్‌రీల్

35 మంది కాంట్రాక్టు కార్మికులకు పదోన్నతి



నియామకపత్రాలు అందిస్తున్న అధికారులు

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలోని 35 మంది కాంట్రాక్ట్ బేసిక్ కార్మికులకు మంగళవారం పర్మినెంట్ కార్మికులుగా పదోన్నతి కల్పించారు. హెచ్ఆర్ మేనేజర్ పార్థసారథి, పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి వారికి నియామకపత్రాలను అందజేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్వవేని శ్రీనివాస్, హెచ్ఆర్ అధికారి సదానందం పాల్గొన్నారు. కాగా, దీపావళి పండుగ సందర్భంగా పర్మినెంట్ కార్మికులకు రూ.90వేల బోనస్ చెల్లించాలని కార్మిక సంఘం అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి కోరారు.

3 నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

మంథని: మంత్రపురిలోని మహాలక్ష్మీ ఆలయంలో ఈనెల 3 – 10వ తేదీ వరకు దుర్గాదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఎండోమెంట్ ఈవో రాజ్‌కుమార్, ఆలయ అర్చకుడు మారుపాక ప్రశాంత్‌శర్మ తెలిపారు. తొమ్మిదిరోజులపాటు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు ఉంటాయన్నారు. ఈనెల 9న చక్రిభజన, 10న గోపాలకాల్వలు, రాత్రి దుర్గాజననం కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నిరంతర భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నిషేధం

గోదావరిఖని: మహిళల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నట్లు సీపీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మందుబాబుల ఆగడాలపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామన్నారు. నెలరోజుల పాటు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. అలాగే డీజే సౌండ్స్, డ్రోన్‌లపైనా ఆంక్షలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

చీడపీడలపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీఏ అంజని

మంథని: పంట నమోదు, చీడపీడల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని మంథని వ్యవసాయ సహాయక సంచాలకురాలు అంజని ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో డివిజన్ స్థాయి సమీక్ష నిర్వహించారు. ఆయిల్‌పాం సాగు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు క్లస్టర్ల వారీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు అనూష, శ్రీకాంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో పెరిగిన ఉత్పత్తి

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారంలో 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో యూరియా ఉత్పత్తి పెరిగింది. గత ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 6,17,600.43 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేసినట్లు యాజమాన్యం మంగళవారం ప్రకటించింది. ఈ యూరియాను తెలంగాణతోపాటు ఆరు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నామని వెల్లడించింది.

యూరియా తరలింపు ఇలా(మెట్రిక్ టన్నుల్లో)


తెలంగాణ	216036.45
ఆంధ్రప్రదేశ్	56481.30
కర్ణాటక	133897.77
మహారాష్ట్ర	66436.92
ఛత్తీస్‌గఢ్	43869.06
తమిళనాడు	46529.91
మధ్యప్రదేశ్	54349.02

15 వరకు ప్రవేశాల గడువు పొడిగింపు

గోదావరిఖనిటౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యా విధానంలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడిగించారని డైరెక్టర్ వి.రామచంద్రం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో ప్రవేశాలకు ఇంటర్మీడియట్, పీజీలో ప్రవేశాలకు ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. మంచిర్యాల, జైపూర్, ఉట్నూర్, చెన్నూర్, లక్సెట్టిపేట, భూపాలపల్లి ప్రాంతాల అభ్యర్థులకు కూడా అవకాశం ఉందని తెలిపారు. వివరాలకు 83413 85000 నంబరులో సంప్రదించాలని కోరారు.

బాపూజీ బాటలో..

- దేశ స్వాతంత్య్రం కోసం అహింసామార్గంలో ఎన్నో ఉద్యమాలు
- మహాత్ముని బాటలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలు
- నేడు గాంధీ జయంతి



దేశానికి స్వాతంత్య్ర తెచ్చిపెట్టిన మహాత్ముడు మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ. ఆ మహనీయుడి ఆశయాలకు అనుగుణంగా నడుస్తున్నారు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు. బాపూజీ కలలుగన్న స్వచ్ఛభారతం వైపు సాగుతున్నారు. పలు గ్రామాల్లో సంపూర్ణంగా మద్య, మాంసాన్ని నిషేధించారు. గీత దాటితే జరిమానా విధిస్తున్నారు. 'స్వదేశీ వస్తువులే వాడుదాం.. మనమే తయారు చేద్దాం' అనే నినాదం నుంచి పుట్టుకొచ్చిందే మెట్‌పల్లి, వావిలాల ఖాదీ. పాలిస్టర్ బట్ట పరుగు పెడుతున్నా... గాంధీ కలలకు ప్రతిరూపంగా భావించి ఖాదీ గొప్పతనాన్ని చాటుతున్నారు. కొందరు గాంధీజీ చిత్రాలను సేకరించి, మదిలో పదిలంగా దాచుకుంటున్నారు. నేడు మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్పెషల్ స్టోరీ.

కరీంనగర్‌లో గాంధీ మ్యూజియం



గాంధీ సెంటనరీ మ్యూజియం

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గాంధీ సెంటనరీ మ్యూజియం 1964లో ఏర్పాటైంది. 1969లో ప్రస్తుత బస్టాండ్ ఎదురుగా 20 గంటల విస్తీర్ణంలో జెడ్పీ నిధులు, దాతల సహకారం, అప్పటి విద్యాశాఖ మంత్రి పీవీ.నరసింహారావు, కలెక్టర్ మాల కొండయ్యల చొరవతో దీన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ ప్రదేశాల్లో లభించిన చారిత్రక ఆధారాలు, శిలాశాసనాలు, తామ్ర పత్రాలు, నాణేలు, ఫిరంగులు, పాతరాతి యుగపు పనిముట్లు, పాత్రలు, విల్లులు, బాణాలు, శాతవాహనులు, రాష్ట్రకూటులు, విష్ణుకుండినులు, చాళుక్యరాజులు, కాకతీయ, విజయనగర రాజులు, మొగలులు, కుతుబ్‌షాహీల కాలానికి చెందిన నాణేలు, ఇటుకలు, రాతికుండలు, విగ్రహాలు, యుద్ధ సామగ్రి, నిజాం కాలం నాటి రాగి, వెండి నాణేలు తదితరాలను ఇక్కడ చూడవచ్చు. ప్రతీరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ మ్యూజియాన్ని ఉచితంగా సందర్శించవచ్చు.

బాపూజీ చిత్రాల సేకరణలో సిరిసిల్ల యువకుడు



సేకరించిన బాపూజీ స్టాంపులు



సాయిరాం

సిరిసిల్లటౌన్: బాపూజీ చిత్రాలు, పేపర్ కటింగ్స్ సేకరించి, భద్రపరుస్తున్నాడు సిరిసిల్ల నెహ్రూనగర్‌కు చెందిన కొత్వాల్ సాయిరాం. స్థానిక కొత్త బస్టాండ్ వద్ద హెయిర్ పార్లర్ నిర్వహిస్తూ దశాబ్దాలుగా గాంధీజీకి సంబంధించిన ప్రతీ చిత్రాన్ని సేకరిస్తున్నాడు. గాంధీ బాల్యం నుంచి ఆయన చనిపోయే వరకు.. 3 వేలకు పైగా ఫొటోలు, స్టాంపులను సేకరించాడు. ఆర్‌బీఐ నుంచి బాపూజీ బొమ్మలతో వెలువడిన నాణేలు, పత్రికల్లో వచ్చిన ఆయన వ్యాసాల క్లిప్పింగ్స్, కుటుంబసభ్యులతో ఉన్న ఫొటోలు కూడా ఇతని వద్ద ఉన్నాయి. పత్రికల్లో వచ్చే గాంధీజీ వ్యాసాలు, ఆయన చిత్రాల క్లిప్పింగులను పదిల పరుస్తున్నాడు. ఇప్పుడు తనకు 41 ఏళ్ల అని, 12 వయసు నుంచి వీటిని సేకరిస్తున్నట్లు తెలిపాడు.

శుభ్రత పాటిస్తరు.. మద్యం ముట్టరు

- ఆదర్శం.. నారాయణపూర్, పదిర, హరిదాస్‌నగర్, దుమాలవాసులు



నారాయణపూర్‌లో రోడ్డుకిరువైపులా పచ్చని చెట్లు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/ఇల్లంతకుంట(మానకొండూరు): మద్యం ముట్టరు.. పరిశుభ్రత పాటిస్తున్నరు రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్, పదిర, హరిదాస్‌నగర్, దుమాల ప్రజలు. ఈ గ్రామాల్లో మద్యం అమ్మితే రూ.5 వేలు జరిమానా విధిస్తామని 20 ఏళ్ల క్రితం తీర్మానం చేశారు. రోడ్లకిరువైపులా పచ్చని చెట్లు ఉన్నాయి. తడి, పొడి చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. వర్మి కంపోస్టు ద్వారా ఆదాయం పొందుతున్నారు. తాను సర్పంచ్‌గా హరిదాస్‌నగర్‌లో స్వచ్ఛతపై దృష్టిసారించానని, గ్రామానికి జాతీయ అవార్డు వచ్చిందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చీటి లక్ష్మణ్‌రావు తెలిపారు.

జంగారెడ్డిపల్లి: ఇల్లంతకుంట మండలంలోని జంగారెడ్డిపల్లె 2023లో జిల్లాస్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు, వరుసగా నాలుగేళ్లు దీన్‌దయాళ్ అవార్డులు అందుకుంది. తడి, పొడి చెత్త వేయడానికి గ్రామ వీధుల్లో స్టీల్ డబ్బాలు ఏర్పాటు చేశారు. రోడ్లకిరువైపులా మొక్కలు నాటారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని ఓ దాత 700 బట్ట సంచులు అందజేశారు. గ్రామస్తులు ఇంకుడు గుంతలు తవ్వుకున్నారు. ప్రతీ వీధిలో సీసీ రోడ్లు కనిపిస్తాయి. సీసీ కెమెరాలు, మైక్ సెట్లు, ఓపెన్ జిమ్‌తో ఆకర్షణగా నిలుస్తోంది.

గూడూరు.. మద్యపాన నిషేధం

ముస్తాబాద్(సిరిసిల్ల): గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఆ ఊరి సొంతం. 18 ఏళ్లుగా మద్యపాన నిషేధం అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని గూడూరు. 2006కుముందు ఈ గ్రామంలోని మగవారు తరచూ మద్యం సేవిస్తూ గొడవలు పెట్టుకోవడం, పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదవడం జరిగేవి. పొద్దంతా కష్టపడితే వచ్చే డబ్బులు మద్యానికే ఖర్చయ్యేవి. దీంతో అప్పటి సర్పంచ్ చీటి వెంకటనర్సింగరావు సమక్షంలో గ్రామస్తులందరూ మద్యపాన నిషేధ నిర్ణయం తీసుకొని, ఇప్పటికీ కట్టుబడి ఉన్నారు. మద్యం విక్రయిస్తే రూ.10 వేల జరిమానా విధించాలని తీర్మానించారు. సర్పంచ్, ఉపసర్పంచ్, మహిళా సంఘాల వారు పర్యవేక్షిస్తున్నారు. కిరాణా దుకాణాల్లో సిగరేట్, గుట్కా విక్రయాలనూ నిషేధించారు.



గూడూరు గ్రామం

రాణా మెట్లెక్కని ఆకసాయిపల్లె



ఆకసాయిపల్లెలో పారిశుధ్య పనులు

ధర్మపురి: మండలంలోని ఆకసాయిపల్లె గిరిజన గ్రామం. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా గ్రామ పంచాయతీగా ఏర్పడింది. గ్రామంలో 600 జనాభా ఉండగా 260 మంది ఓటర్లున్నారు. ఇక్కడి ప్రజలు ఐకమత్యానికి మారుపేరుగా నిలుస్తున్నారు. ఎవరికి ఓటు వేయాలనేది కలిసే నిర్ణయిస్తారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా అందరూ కలిసి, సర్పంచ్ ఆధ్వర్యంలో పరిష్కరించుకుంటారు. గ్రామానికి చెందిన ఒక్కరు కూడా ఇప్పటివరకు ఠాణా మెట్లెక్కలేదు. గ్రామస్తులపై పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి కేసులు నమోదు కాలేదు. ఉదయం కూలీ పనులకు వెళ్తే.. సాయంత్రం తిరిగి వస్తారు. వచ్చాక ఒక్కచోట కూర్చొని, కబుర్లు చెప్పుకుంటూ సంతోషంగా జీవిస్తున్నారు.

వావిలాల నుంచే జాతీయ జెండా



కండెలు తయారు చేస్తున్న మహిళలు

జమ్మికుంట(హుజూరాబాద్): దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో భాగంగా గాంధీజీ శిష్యుడు అన్నాసాహెబ్ సహస్ర బుద్ధి 1929లో కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని వావిలాల గ్రామంలో పర్యటించారు. ఇక్కడ మహారాష్ట్ర చరఖా సంఘ్‌ను ప్రారంభించారు. 1951లో హైదరాబాద్ ఖాదీ సమితిగా, 1967లో మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ నుంచి విడిపోయి, వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్‌గా ఏర్పడింది. దీనికి ఈ గ్రామ దేశ్‌ముఖ్ ఎక్కటి అన్నారెడ్డి ఏడెకరాల భూమిని దానంగా ఇచ్చారు. ఇక్కడ సుమారు 1,000 మంది వస్త్రాల తయారీతో ఉపాధి పొందుతున్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చాక 1972లో ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవం, జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోటపై ఎగురవేసిన జాతీయ జెండాలు వావిలాలలో తయారు చేసినవేనని ఖాదీ సంస్థ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రాతిష్టాన్ 2005లో ఉత్తమ నేత కార్మికులు, 2009లో ఉత్తమ ఖాదీ సంస్థగా రెండుసార్లు జాతీయ స్థాయిలో అవార్డులు దక్కించుకుంది.

మెట్‌పల్లి నుంచి నెహ్రూకు లాల్చీ



ఖాదీ ప్రతిష్టాన్ కార్యాలయం

మెట్‌పల్లి(కోరుట్ల): విదేశీ వస్తువులను బహిష్కరించి, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని బాపూజీ చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకొని, ఆయన శిష్యుడు అన్నాసాహెబ్ సహస్ర బుద్ధి 1929లో మెట్‌పల్లికి వచ్చి, అఖిల భారత చరఖా సంఘం ఏర్పాటు చేశారు. ఇక్కడి ఖాదీ కార్మికులు ఓవైపు వస్త్రాలను తయారు చేస్తూనే.. మరోవైపు స్వాతంత్య్ర, నిజాంకు వ్యతిరేకంగా జరిపిన ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1951లో హైదరాబాద్ ఖాదీ సమితిగా, 1967లో మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్‌గా మార్పుబడింది. జోగ గంగారాం అనే కార్మికుడు కుట్టు లేకుండా లాల్చీని తయారు చేసి, అప్పటి ప్రధాని నెహ్రూకు, మగ్గంపై రూపొందించిన షేర్వానీని అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్‌కు అందించి, ఖాదీ ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటాడు.

పొరపాట్లు లేకుండా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు

- జిల్లాలో రేపటి నుంచి 8వ తేదీ వరకు కుటుంబ వివరాల నమోదు
- కలెక్టర్ కోయ శ్రీహర్ష వెల్లడి



ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టుపై అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈనెల 3వ తేదీ నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డు వివరాలు సేకరిస్తారని, ఇందులో పొరపాట్లు దొర్లకుండా పకడ్బందీగా నమోదు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి డిజిటల్ కార్డులపై తన కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ సమీక్షించారు. నియోజకవర్గంలోని రెండేసి ప్రాంతాలను ఎంపిక చేసుకుని కుటుంబ వివరాలు సేకరించాలన్నారు. పెద్దపల్లి మున్సిపల్‌లోని ఓ వార్డు, సుల్తానాబాద్‌లో ఓ గ్రామం, రామగుండం సెగ్మెంట్‌లోని పాలకుర్తి మండలంలో ఓ గ్రామం, కార్పొరేషన్‌లో ఓ డివిజన్, మంథని నియోజకవర్గంలోని మున్సిపల్‌లో ఓ వార్డు, ముత్తారం మండలంలో ఓ గ్రామాన్ని ఎంపిక చేసుకుని డిజిటల్ కార్డుల కోసం కుటుంబాల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఈనెల 3న ప్రారంభించి ఈనెల 8వ తేదీవరకు ఈ ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. 9న వివరాలను పరిశీలించి ఈనెల 10వ తేదీ వరకు నివేదిక అందజేయాలని అన్నారు. ఆర్డీవోలు గంగయ్య, హనుమా నాయక్, మున్సిపల్ కమిషనర్లు, డీపీవో తదితరులు ఉన్నారు.

వయోవృద్ధులకు అండగా ఉంటాం

వయోవృద్ధుల సంక్షేమానికి అండగా ఉంటామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి రవుఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వయోవృద్ధుల దినోత్సవంలో పలువురు సీనియర్ సిటిజన్లను ఆయన సత్కరించి మాట్లాడారు.

బీసీ హాస్టల్ తనిఖీ..

రంగంపల్లి బీసీ బాలుర కాలేజీ హాస్టల్‌ను కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. సేవలు, వసతులపై ఆరా తీశారు. వార్డెన్ అందుబాటులో ఉంటున్నాడా..? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతపై ప్రశ్నించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు.

దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే దంపతుల పూజలు

గోదావరిఖనిటౌన్: దుర్గాదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్థానిక కల్యాణ్‌నగర్‌లో వేడుకలు నిర్వహించారు. దేవీయూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించే అమ్మవారి విగ్రహ పూజల్లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ దంపతులు మనాలీ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. దుర్గాదేవీ అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు ఉండాలని మక్కాన్‌సింగ్ ఆకాంక్షించారు. బతుకమ్మ, దసరా వేడుకలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన సూచించారు. ప్రధానంగా దుర్గాదేవీ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా జరుపుకోవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా భక్తులు నిష్ఠతో అమ్మవారికి పూజలు చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

కొత్త గనులతోనే సింగరేణి మనుగడ

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: కొత్త గనులు ప్రారంభిస్తేనే సింగరేణికి మనుగడ ఉంటుందని, దీనికోసం కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. జీడీకే–11గనిపై మంగళవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్, గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ జోక్యంతో సంస్థ దివాళా తీసే పరిస్థితి ఏర్పడిందన్నారు. నిజాతీగల అధికారులకు స్థానం లేకుండా పోతోందని, సంస్థ కోసం నిబద్ధతతో పనిచేసే అధికారుల సంఖ్య తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. డైరెక్టర్(పా)పై రాజకీయ ఒత్తిడిని తాము ఖండిస్తున్నామన్నారు. సింగరేణి సంస్థలో బడాఖాన పేరిట కార్మికుల వేతనాల నుంచి రూ.300 – రూ500 వరకు రికవరీ చేయాలనే యత్నాన్ని విరమించుకోవాలని, యాజమాన్యమే కంపెనీకి వచ్చిన లాభాల్లో నుంచి చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సంస్థలో రాజకీయ జోక్యం మితిమీరిపోయిందని, తద్వారా గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ప్రాధాన్యతను గుర్తించకుండా యాజమాన్యం అవినీతికి తెరలేపిందని ఆరోపించారు. యాజమాన్యం రాజకీయ జోక్యాన్ని, అవినీతిని అరికట్టాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు సమావేశంలో నాయకులు కె.సారయ్య, వైవీ రావు, మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోశం తదితరులు పాల్గొన్నారు.

'బిరుదు' విగ్రహం ఏర్పాటు చేస్తాం



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక పూసాలరోడ్డులో మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు విగ్రహం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. స్థానిక రాజమల్లు నివాసంలో మంగళవారం జరిగిన బిరుదు జయంతి సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. 55 మందికి మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ప్రతినిధులు బిరుదు సుశీల, బిరుదు రాధాకృష్ణ, గాజుల లక్ష్మి, గాజు రాజమల్లు, బిరుదు సమత, శ్రీగిరి శ్రీనివాస్, ముస్త్యాల రవీందర్, ఈర్ల స్వరూప, మినుపాల స్వరూప, ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, పూసాలరోడ్డులో జరిగిన బిరుదు రాజమల్లు జయంతి కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి మాట్లాడుతూ, బిరుదు రాజమల్లు ఆశయ సాధన కోసం ప్రతీకార్యకర్త కృషి చేయాలని సూచించారు.

ఒక్కస్కీం కూడా సక్కగా అమలు కావట్లే





కలెక్టరేట్ ఎదుట ధర్నా, అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందిస్తున్న ఈశ్వర్, మధు, కోరుకంటి

- మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజం

సాక్షి,పెద్దపల్లి: ఆరు గ్యారంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తొమ్మిది నెలలు గడుస్తున్నా ఒక్క స్కీంను కూడా సక్కగా అమలు చేయడం లేదని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మంగళవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌కు చేరుకుని అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట జరిగిన కార్యక్రమంలో ఈశ్వర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ సమస్య కాదని, లక్షల మంది రైతుల సమస్యన్నారు. అందరికీ రుణమాఫీ చేశామని కాంగ్రెస్ నేతలు మిఠాయిలు పంచుకుని సంబురాలు చేసుకుంటున్నారని, క్షేత్రస్థాయిలో అనేకమంది రైతులు రుణమాఫీ వర్తించక అప్పులతో ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేసేదాకా కాంగ్రెస్ పార్టీని వదిలేదే లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ హెచ్చరించారు. పుట్టెడు మందిలో పిడికెడు మంది రైతులకు రుణమాఫీ చేసి గొప్పలు చెప్పుకోవద్దని జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు ఎద్దేవా చేశారు. అధికారంలోకి రావడానికి 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. వాటిని అటకెక్కించిందని మాజీఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి విమర్శించారు. నాయకులు రఘువీర్‌సింగ్, రాజ్‌కుమార్, రాములు, ఉష, లక్ష్మణ్, సంపత్, బాలాజీరావు, శ్రీనివాస్ ఉన్నారు.

క్లుప్తంగా

నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన



మంథని: నియోజకవర్గంలోని మహదేవపూర్, కాటారం, మంథని మండలాల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం పర్యటించనున్నారు. మహదేవపూర్, కాటారంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఆయన ప్రారంభిస్తారు. అలాగే కాటారంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గాంధీజీ విగ్రహాన్ని ప్రారంభిస్తారు.. అనంతరం మంథనిలోని శివకిరణ్ గార్డెన్‌లో అంగన్‌వాడీలకు పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా పెరటి కోళ్ల పంపిణీలో మంత్రి పాల్గొననున్నారు.

మైనింగ్ ఆఫీసర్ పేరిట వసూళ్లు : వ్యక్తిపై కేసు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): దుబ్బపల్లి వద్ద రాజీవ్ రహదారిపై ఇసుక లారీలను ఆపి మైనింగ్ ఆఫీసర్ అని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేటకు చెందిన పురుషోత్తం సతీశ్ అనే వ్యక్తి మైనింగ్‌శాఖ అధికారి అని చెప్పి రాజీవ్ రహదారిపై వెళ్తున్న ఇసుక లారీలను ఆపుతున్నాడన్నారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్నాయని బెదిరించి డ్రైవర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడని గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈమేరకు నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మారుపేరు బాధితుల ధర్నా



వినతిపత్రం అందిస్తున్న బాధితులు

రామగిరి(మంథని): సింగరేణిలోని మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసు బాధితులు మంగళవారం స్థానిక ఆర్జీ–3 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 30ఏళ్ల పాటు విధులు నిర్వర్తించి అనారోగ్యంతో మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికుల వారసులు.. డిపెండెంట్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేశారని, అయితే, మారుపేర్లు ఉన్నాయనే కారణంతో విజిలెన్స్ అధికారులు 15ఏళ్లుగా తమను ఇబ్బందులు పెడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కమిషన్ సమక్షంలో సమస్య పరిష్కరించి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని సింగరేణి, కార్మిక సంఘాలు ఒప్పందం చేసుకున్నాయని గుర్తుచేశారు. అనంతరం ఎస్‌వోటూ జీఎం రఘుపతికి వినతిపత్రాన్ని అందజేశారు. పొన్నం వెంకటేశ్, హరీశ్, బాలకృష్ణ, జి.సుధాకర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాల పాటలు.. ఆడబిడ్డల ఆటలు

- నేటినుంచి బతుకమ్మ వేడుకలు
- ఎంగిలిపూలతో ప్రారంభం
- 10న సద్దులతో ముగింపు
- సిద్ధమవుతున్న అతివలు
- మార్కెట్లో సందడి

ఇద్దరక్క చెల్లెండ్లు ఉయ్యాలో..
ఒక్కూరికిచ్చిరి ఉయ్యాలో..
ఒక్కడే మాయన్న ఉయ్యాలో..
వచ్చెన్నపోడు ఉయ్యాలో..

అంటూ నేటినుంచి ఆడబిడ్డలు ఆడి పాడనున్నారు. తెలంగాణ ఆడపడుచులకు ఇష్టమైన బతుకమ్మ వేడుక నేటి ఎంగిలిపూలతో ప్రారంభం కానుంది. పుడమికి పూల పందిరేసినట్లు.. పున్నమి వెన్నెల నేలపై వాలినట్లు.. రంగురంగుల పూలతో రంగవల్లులు అల్లుకున్నట్లు.. సిబ్బిలో, పళ్లెంలో, తాంబాలాల్లో బతుకమ్మను పేర్చి.. ఆడబిడ్డలందరూ ఒక్కచోట చేరి.. వీధుల్లో బతుకమ్మను ఉంచి.. ఆడిపాడే పండుగ రానే వచ్చింది. నేటి ఎంగిలిపూలతో ప్రారంభమై.. అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానెబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నెముద్దల బతుకమ్మ, తొమ్మిదోరోజు సద్దుల(పెద్ద) బతుకమ్మతో పండుగ ముగుస్తుంది. ఈ క్రమంలో బతుకమ్మ వేడుకలు ఉమ్మడి జిల్లా ఆడపడుచులు రెడీ అవుతున్నారు. మార్కెట్లో పూలు, సామగ్రితో సందడి నెలకొంది.

– కరీంనగర్‌కల్చరల్/విద్యానగర్(కరీంనగర్)



బతుకమ్మ అనే పదానికి తెలంగాణలో విభిన్న పర్యాయ పదాలు వాడుకలో ఉన్నాయి. బతుకమ్మ అంటే పూలతో కూడిన అమరిక అని అర్థం. ఈ కాలంలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను కొన్ని వరసలు పేరుస్తారు. మధ్యలో గౌరమ్మను పెట్టి అమ్మవారిగా కొలుస్తారు. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మను జరుపుకుంటారు. నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి నైవేద్యం చేస్తారు. రెండోరోజు అటుకల బతుకమ్మగా కొలుస్తారు. బెల్లం, అటుకులు, పప్పుతో చేసిన నైవేద్యాన్ని సమర్పిస్తారు. మూడోరోజు ముద్దపప్పు బతుకమ్మగా జరపుకుంటారు. బెల్లం, ముద్దపప్పు, పాలతో తయారు చేసిన నైవేద్యాన్ని తయారు చేస్తారు. నాలుగోరోజు నానె బియ్యం బతుకమ్మను జరుపుకుంటారు. నానపెట్టిన బియ్యం, పాలు, బెల్లంతో కలిపి ముద్దలుగా తయారుచేసి నైవేద్యంగా సమర్పిస్తారు.ఐదోరోజు అట్ల బతుకమ్మను జరుపుకుంటారు. బియ్యం పిండితో అట్లను నైవేద్యంగా తయారు చేస్తారు. ఆరోరోజు అలిగిన బతుకమ్మ. ఈరోజు బతుకమ్మను పూలతో అలకరించరు. ఏడోరోజు వేపకాయల బతుకమ్మ. తంగేడు, చామంతి, గులాబీ, గునక పూలతో ఏడంతరాలు బతుకమ్మను పేరుస్తారు. బియ్యం పిండిని వేపపండ్లుగా తయారు చేసి నైవేద్యంగా పెడతారు. ఎనిమిదో రోజు వెన్నెముద్దల బతుకమ్మ. అమ్మవారికి ఇష్టమైన నువ్వులు, వెన్న, బెల్లంతో తయారు చేసిన నైవేద్యాన్ని సమర్పిస్తారు. బతుకమ్మ నవరాత్రి ఉత్సవాల్లో సద్దుల బతుకమ్మ చివరిది. ఈ రోజు అన్నిరకాల పూలతో భారీ బతుకమ్మలను పేరుస్తారు. మహిళలు నూతన వస్త్రాలు ధరించి ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను పెట్టి ఆటపాటలతో గౌరమ్మను కొలుస్తారు. పెరుగన్నం, నువ్వుల అన్నం వంటి ఐదు రకాల వంటకాలను నైవేద్యంగా సమర్పిస్తారు.

ఉమ్మడి జిల్లాలో విభిన్నంగా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బతుకమ్మను కొన్ని ప్రాంతాల్లో విభిన్న తీరిలో కొలుస్తారు. జగిత్యాల జిల్లాలోని కొన్నిచోట్ల బతుకమ్మ ఆడే చోట బావిలాంటి గుంత తవ్వి.. చుట్టూ బతుకమ్మలు పెట్టి ఆడతారు. వేములవాడలో ఏడు రోజులకు సద్దుల పండుగ జరుపుకుంటారు. కరీంనగర్ జిల్లాలోని బొమ్మకల్, రాఘవాపూర్, శ్రీనివాస్‌నగర్, ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల్లో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ నిర్వహిస్తారు. కొన్ని ప్రాంతాల్లో మగవారు బతుకమ్మ ఆడతారు. జగిత్యాల జిల్లా, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో దసరా పండుగ తరువాత సద్దుల బతుకమ్మ జరుపుకుంటారు.

తొమ్మిది రోజుల సంబరం



ఏడాది మొత్తం ఎదురుచూస్తూ మహిళలందరూ తొమ్మిది రోజులు సంతోషంగా జరుపుకునే వేడుక బతుకమ్మ. మెట్టినిల్లు ఎక్కడ ఉన్నా.. పుట్టింటి కి చేరి స్నేహితులతో, వాడకట్టువాళ్లతో కలిసి జరుపుకునే పండుగ. మన పల్లెసంస్కృతికి అద్దంపట్టే ఈ పండుగ వెళ్లినప్పటి నుంచి మళ్లీ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూసేలా చేస్తుంది.

– మెతుకు హేమలత, హరిహరనగర్, కరీంనగర్

అమ్మను ఆరాధించడమే



భూమిపై ఉన్న సకల జీవాలను కాపాడేదే శక్తి. అందుకే ఆటపాటలతో అమ్మను ఆరాధించడమే బతుకమ్మ. ఆట పాటలు, నవ్వులు, కేరింతలే వ్యాయామం అంటున్నారు వైద్యులు. ఏడాదికి ఒక్కసారి వచ్చే ఈ పండుగలో ఇవి అన్ని ఉన్నాయి.

– మడుపు విజయలక్ష్మి, భగత్‌నగర్, కరీంనగర్

మన సంస్కృతికి నిదర్శనం



మన సంస్కృతికి నిదర్శనం బతుకమ్మ. ప్రతీ పువ్వుకు పవిత్రత చేకూర్చి ఆరాధనీయం చేసిన పల్లెవాసుల మంచి మనస్సుల ప్రతీకగా బతుకమ్మ నిలుస్తుంది. తొమ్మిదిరోజుల పాటు పాట, ఆట కలగల్సిన బతుకమ్మ సంబరాలతో పల్లె, పట్టణం మునిగి తేలుతుంది.

– తొడుపునూరి సౌమ్య, జ్యోతినగర్, కరీంనగర్

నుదుటి సింధూరం



మహిళల ఆరాధ్య దేవతగా భాసిల్లుతున్న తీరొక్క పూల పండుగ బతుకమ్మ. పూలతో పూజలు చేసే సనాతన సంప్రదాయానికి భిన్నంగా పూలకు పూజలు చేసే విశిష్ట వేడుక. రంగురంగుల పూలను అందమైన ఆకృతితో కూర్చి, లయ, విన్యాసాలను ఆటలో చేర్చి, ఆధ్యాత్మికతను చాటే బతుకమ్మ తెలంగాణ నుదుటి సింధూరం.

– బాశెట్టి రత్నమాల, తీగలగుట్ట పల్లి, కరీంనగర్

అనుబంధాలకు ప్రతీక



అన్నకు చెల్లెళ్లకు ఉన్న అనుబంధంతో పాటు ప్రకృతికి మహిళలకు ఉన్న బంధానికి ప్రతీక బతుకమ్మ. ఈ పండుగ తీరు అన్ని పండుగలకు భిన్నంగా ఉంటుంది. మహిళలందరూ సంప్రదాయ దుస్తులు ధరించి ఒక్కచోట చేరి సంబురాలు జరుపుకోవడం, నైవేద్యాలు ఇచ్చి పుచ్చుకోవడం అందరిలో ప్రేమాభిమానాలు పెంపొందిస్తుంది.

– ఇనుకొండ అనిత, భగత్‌నగర్, కరీంనగర్

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై విద్యార్థుల ఫ్లాష్‌మాబ్



ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: జెండాచౌరస్తా వద్ద మంగళవారం ట్రినిటీ డిగ్రీ, పీజీ విద్యార్థులు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, శాతవాహన యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ మనోహర్‌తో కలిసి శాంతికపోతాలను ఎగురవేశారు. రోడ్లు, డ్రైనేజీల్లో చెత్త వేయొద్దని, ఇంటికి వచ్చే మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందించాలంటూ విద్యార్థులు ఇచ్చిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, టీపీఎస్ వినయ్, సురేందర్, రమాకాంత్, వైస్ ప్రిన్సిపాల్ నీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు ఆస్పత్రిలో ప్రసూతి సేవలు భేష్



మాతాశిశు ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగినందుకు కేక్ కట్‌చేసి అభినందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: స్థానిక మాతాశిశు ఆస్పత్రిలో ప్రసూతి సేవలు మెరుగ్గా అందుతున్నాయని, గతనెలలో 200 మైలురాయి దాటి ప్రసవాలు చేయడం అభినందనీయమని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో పలు విషయాలు వెల్లడించారు. గత ఆర్నెల్లో 130 ప్రసవాలు జరిగాయని, అందులో గత ఆగస్టులో 198, సెప్టెంబర్‌లో 203 ప్రసవాలు చేసిన వైద్యులు, సిబ్బంది అభినందనీయులన్నారు. ప్రతీపీహెచ్‌సీ పరిధిలో గర్భిణులకు 102 వాహన సేవలు అందేలా ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు చూడాలని సూచించారు. ఆర్థోపెడిక్‌లో మేజర్ సర్జరీలు 39 చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రీధర్, ఆర్‌ఎంవో రవీందర్, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్



సంఘీభావం ప్రకటిస్తున్న ఐద్వా నాయకులు

గోదావరిఖని: మహిళల హక్కుల రక్షణ, వారిపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలను అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి కోరారు. మంగళవారం స్థానిక శ్రామిక్‌భవన్‌లో జరిగిన అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) మూడో మహాసభలు నిర్వహించారు. తొలుత జెండా ఆవిష్కరణ చేసి మల్లు స్వరాజ్యం, సీతారాం ఏచూరి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై దాడులను సంఘటితంగా ఎదుర్కోవాలన్నారు. మహిళల హక్కుల పరిరక్షణ కోసం పలు తీర్మాణాలు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండి ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇళ్లస్థలాల సాధనకు ఐద్వా ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకురాలు ఎ.మహేశ్వరి, అరుణ, ఆశ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా పేరు నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న బండారి రాజ్‌కుమార్

మంథని: కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునే పట్టభద్రులు జాబితాలో ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ బండారి రాజ్‌కుమార్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా తెలంగాణ గ్రాడ్యుయేట్ ఫోరం ఏర్పాటు చేశామని, నాలుగు జిల్లాల పరిధిలోని 42 నియోజకవర్గాల్లో 42 మంది కో ఆర్డినేటర్లను నియమించామని ఆయన తెలిపారు. ఓటరు నమోదుకు విస్తృతంగా ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. ఐదు లక్షల మంది ఓటర్ల నమోదు లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల ద్వారా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్ పద్ధతిలో ఓటుహక్కు నమోదు చేసుకునే పట్టభద్రులు ఫారం – 18 ద్వారా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేయాలని కోరారు. ఆన్‌లైన్ పద్ధతిలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలని ఆయన సూచించారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే పరామర్శ



ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే విజయరమణారావు మంగళవారం హైదరాబాద్‌లో మంగళవారం పరామర్శించారు. మంత్రి తండ్రి పురుషోత్తంరెడ్డి ఇటీవల మరణించి న విషయం విదితమే. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళి అర్పించారు.

అంతర్గాంలో యువకుడి హత్య



విద్యాసాగర్ (ఫైల్)

జగిత్యాలక్రైం: అంతర్గాం గ్రామానికి చెందిన నల్లపునేని విద్యాసాగర్ (33) మంగళవారం సాయంత్రం హత్యకు గురయ్యాడు. సాయంత్రం ఇంటి సమీపంలో శవమై ఉండడాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించాడు. అతడిని ఎవరో హత్య చేసినట్లు గుర్తించారు. హతుడి తల్లిదండ్రి, సోదరుడు, మరదలు కనిపించకుండాపోవడం... విద్యాసాగర్‌కు ఆయన సోదరుడు విక్రమ్‌రాజు మధ్య కొద్దికాలంగా కుటుంబకలహాలు ఉన్నాయని తేలడం.. కొద్దికాలంగా తల్లితండ్రులతోపాటు సోదరుడిని నిత్యం వేధిస్తుడడంతో విక్రమ్‌రాజే హత్య చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విద్యాసాగర్ మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హత్య చేశారని అనుమానిస్తున్న విక్రమ్‌రాజు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యార్థుల ఇంటిబాట



బతుకమ్మ, దసరా పండుగ సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఎగిరి గంతులేస్తూ ఇంటి బాట పట్టారు.. పండుగ సెలవుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు.. సెలవులు ప్రకటించగానే.. పుస్తకాలు, ట్రంకుపెట్టెలు సిద్ధం చేసుకుని తమ తల్లిదండ్రుల రాకకోసం మంగళవారం ఉదయం నుంచీ వేచి చూశారు. వారు వచ్చీరాగానే ముల్లెమూట సర్దుకుని ఇంటిబాట పట్టారు. వీరి రాకతో ఆర్టీసీ బస్టాండ్ కిక్కిరిపోయింది. రంగంపల్లి జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు ఇలా ఇళ్లకు వెళ్తుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ప్రైవేట్ ఓబీల్లో స్థానికులకే ఉపాధి

- స్వస్థలాలకు స్థానికేతర కార్మికులు
- దృష్టి సారించిన ఎమ్మెల్యే ఠాకూర్
- స్థానిక నిరుద్యోగుల్లో ఆశలు



గోదావరిఖని నుంచి స్వస్థలాలకు తరలివెళ్తున్న ఇతర రాష్ట్రాల కాంట్రాక్ట్ కార్మికులు(ఫైల్)

గోదావరిఖని: సింగరేణి ప్రైవేట్ ఓబీ(ఓవర్ బర్డెన్) పనుల్లో ఇక నుంచి స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. స్థానికేతరులకు అవకాశం లేదంటున్నారు. ఇప్పటికే పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల యువకులను స్వస్థలాలకు పంపించివేస్తున్నారు.

రెండు రీజియన్లలో 950మంది స్థానికేతరులు..

సింగరేణి రామగుండం రీజియన్‌లోని ఆర్జీ–1, 2 ఏరియాల్లోగల ప్రైవేట్ ఓబీల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన సుమారు 950మంది వరకు స్థానికేతరులు ఉన్నట్లు గుర్తించారు. ఈక్రమంలో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు ఓబీల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల యువతను వారి రాష్ట్రాలకు పంపించివేస్తున్నారు. ఇలా గత 10రోజుల్లో జీడీకే–5 ఓసీపీలోని పీసీ పటేల్ ఓబీలో పనిచేసే సుమారు 250 మందిని తమ రాష్ట్రాలకు పంపించివేశారు.


ఎమ్మెల్యే నజర్..

ప్రైవేట్ ఓబీల్లో పనిచేస్తున్న స్థానికులు ఎంతమంది? స్థానికేతరులు ఎందరు? వారు ఏ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ పనిచేస్తున్నారు? అనే అంశాలపై రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈక్రమంలో ఆర్జీ–1, 2 ఏరియాల జీఎంలతో ఇటీవల సమీక్షించారు. స్థానికులకే ఉద్యోగవకాశాలు కల్పించాలని, ఈవిషయంలో పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. సమావేశం ముగిసిన వెంటనే పీసీ పటేల్ ప్రైవేట్ ఓబీలో పనిచేస్తున్న 250 మందిని పంపించేంత వరకు పనులు నిలిపివేయించారు. పనులు నిలిపివేయడంలో ఓబీ యాజమాన్యం చేసేదేమీ లేక బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన యువకులను సొంత ఊళ్లకు పంపించారు.

ఇక స్థానికులకే అవకాశం..

ఇతర రాష్ట్రాలకు చెందిన యువకులను సాగనంపగా, వారిస్థానంలో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. ఈమేరకు త్వరలో భారీగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. అయితే ఓబీ టెండర్లలో కూడా స్థానికులకే 80శాతం అవకాశం కల్పించాలనే నిబంధనలు పొందుపర్చడం కూడా స్థానికులకు కలిసివచ్చిందని అంటున్నారు.


స్థానికులకే అవకాశం



ప్రైవేట్ ఓబీ కంపెనీల్లో స్థానికులకే అధికా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. గతంలో స్థానికేతరులు ఎక్కువ మంది ఉండడంతో చాలామందిని ఇక్కడ నుంచి పంపించి వేశారు. వారిస్థానంలో స్థానిక ఎమ్మెల్యే సూచన మేరకు ఈప్రాంతం వారికి అవకాశం కల్పిస్తాం. ఈవిషయంలో అందరి సహకారం అవసరం.

– లలిత్‌కుమార్, ఆర్జీ–1 జీఎం

హామీ నెరవేర్చడమే లక్ష్యం



గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. ఈక్రమంలో పీసీ పటేల్ కంపెనీలో పనిచేస్తున్న చాలామంది స్థానికేత యువతను వారి స్వస్థలాలకు పంపించివేస్తున్నాం. బయట నుంచి ఎంత ఒత్తిడి వచ్చినా ఈ విషయంలో రాజీపడేదిలేదు. నియోజకవర్గంలోని అన్ని ఓబీల్లో స్థానికులు 80శాతం ఉండాల్సిందే. స్థానికేతరుల స్థానంలో ఇక్కడి వారికి అవకాశం కల్పిస్తాం.

– మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం